కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులు ప్రభుత్వమే సప్లై చేయాలి

బోధన్ రూరల్, జూలై 10: ఐదు నెలల నుంచి బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అప్పులు తెచ్చి వంట సరుకులు తెస్తున్నారని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి అన్నారు. బుధవారం బోధన్ మండల విద్యాశాఖ అధికారికి కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు కోడిగుడ్లు, రాగిజావ వడ్డించాలని ప్రభుత్వం చెబుతోందని ఇది సరికాదని అన్నారు. కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షురాలు రూప, ఉమా శ్యామ్‌రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాలూరా ఎత్తిపోతల పథకం నీటి విడుదల

ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు

బోధన్ రూరల్, జూలై 10: సాలూరా మండల శివారులోని సాలూరా ఎత్తిపోతల పథకం నీటిని బుధవారం గ్రామ లిఫ్ట్ కమిటీ అధ్యక్షుడు సురేశ్‌పటేల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం కింద 1600 ఎకరాల ఆయకట్టు ఉందని అన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ రెండు పంటలు పండించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో లిఫ్ట్ కమిటీ సభ్యులు అల్లె రమేశ్, నాగరాజు, కందిమల్ల లక్ష్మణ్, డిస్కో సాయిలు, ఆర్టీసీ భూమయ్య, బుద్ద లక్ష్మణ్, సాయిరెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూముల పరిశీలన

ఎస్సారెస్పీ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేందర్‌కుమార్

నవీపేట, జూలై 10: కబ్జాకు గురైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూములను నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్ బుధవారం పరిశీలించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో నాళేశ్వర్ గ్రామానికి చెందిన కొట్టే హన్మాండ్లు, కొట్టే అర్జున్‌కు చెందిన ఎడున్నర ఎకరాల భూమి మునిగిపోయింది. వారికి గతంలో ప్రభుత్వం పరిహారం అందజేసింది. ఈ భూమిలో వీరు పంటలు పండించుకుంటున్నారు. ఒకరి భూమిని మరొకరు కబ్జా చేసుకోవడంతో వివాదం ఏర్పడింది. వీరు ఇద్దరూ గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో వచ్చి భూములను పరిశీలించారు. ఈ భూములు ప్రభుత్వానికి సంబంధించినవని, సామరస్యంగా భూములను సాగు చేసుకోవాలని చెప్పారు. లేదంటే ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. అనంతరం నవీపేటలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో బాలికల గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. తహసీల్దార్ నారాయణ తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం

-కబ్జాదారుడికి ఇరిగేషన్ అధికారి నోటీసు

నవీపేట, జూలై 10: మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలంటూ కబ్జాదారుడికి బుధవారం నోటీసు జారీ చేసినట్లు నవీపేట ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ తెలిపారు. స్టేషన్ ఏరియాకు చెందిన మహ్మద్ ఆఫ్రోజ్‌ఖాన్ మండల కేంద్రంలో పాత ఇరిగేషన్ కార్యాలయ స్థలాన్ని కబ్జా చేసి బయటికి కనిపించకుండా పాత బట్టలతో కట్టాడు. లోపల రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని ఏఈ పేర్కొన్నారు. ఈ స్థలానికి సంబంధించిన పత్రాలుంటే చూయించాలని, లేదంటే మూడు రోజుల్లో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని సూచించారు. లేదంటే తామే నిర్మాణాన్ని కూల్చి వేస్తామని నోటీసులలో పేర్కొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కంఠేశ్వర్, జూలై 10: ఎన్నికల ముందుకు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. రూ. 2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వెంటనే అమలు చేయాలని వినతి పత్రంలో కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, జీపీ కార్మికుల ఆందోళనలు

కమ్మర్‌పల్లిలో తహసీల్దార్ ఆంజేయులుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ధర్పల్లిలో తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బోధన్/మోర్తాడ్/ ఆర్మూర్‌టౌన్/ ఏర్గట్ల/ ముప్కాల్/ వేల్పూర్/ మోస్రా (చందూర్)/ ఇందల్వాయి/ ధర్పల్లి/నవీపేట, జూలై 10: దేశవ్యాప్తం డిమాండ్స్ డేలో భాగంగా ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, జీపీ తదితర అన్ని రకాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బోధన్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బోధన్, సాలూరా మండలాలకు చెందిన ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ప్రతి నెలా 5వ తేదీ లోగా వేతనాలు అందించాలని, నెలకు కనీసం రూ.26వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు అందజేశారు. మోర్తాడ్‌లో తహసీల్దార్ సత్యనారాయణ, కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులుకు అంగన్‌వాడీ టీచర్లు వినతి పత్రాన్ని అందించారు. అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు దేవగంగు మాట్లాడారు. ఆర్మూర్‌టౌన్ పట్టణంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏర్గట్ల మండల కేంద్రంలో తహసీల్దార్ యూసుఫ్‌కు మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు వినతి పత్రం అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. వేల్పూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్ సరితకు వినతి పత్రం సమర్పించారు. మోస్రాలో తహసీల్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపి వినతి పత్రాన్ని అందజేశారు. ఇందల్వాయి పీహెచ్‌సీ వద్ద ఆశవర్కర్లు నిరసన తెలిపి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ధర్పల్లిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తహసీల్దార్ మాలతికి వినతిపత్రం సమర్పించారు. నవీపేట మండల కేంద్రంలో ఆశ వర్కర్లు ధర్నా చేశారు. డిప్యూటి తహసీల్దార్ తెలంగాణరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఏర్గట్లలో తహసీల్దార్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మోస్రాలో తహసీల్దార్ మారుతికి వినతి పత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు

ముప్కాల్‌లో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కోటగిరి, జూలై 10: ఎత్తొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు గంగరాజులు, శానం సాయిలు, సునీతాకుమారి, రమేశ్‌ను స్థానికప్ర జాప్రతినిధులు, గ్రామస్తులు బుధవారం సన్మానించారు. సన్మాన గ్రహీత సునీతాకుమారి పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణ చేశారు. శానం సాయిలు మూడేండ్లకు సరిపడా నోటు పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మల్లారెడ్డి, అలివేలు, మాజీ సర్పంచ్ సాయిబాబా, మాజీ ఎంపీటీసీ ఫారుక్, విఠల్, విలాస్, సీఆర్‌పీ సుధాకర్ పాల్గొన్నారు.

నడ్పల్లి యూపీఎస్‌లో..

డిచ్‌పల్లి, జూలై 10 : మండలంలోని నడ్పల్లి గ్రామ యూపీఎస్‌లో పదేండ్లపాటు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న మహిళా ఉపాధ్యాయులు రమ, ఉమా, స్రవంతిని బుధవారం వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై నడ్పల్లి పాఠశాలకు వచ్చిన విజయ, జ్యోతి, వెంకటరమణి, బాలమణి, సుజాతను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రుద్రూర్, జూలై 10: మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్, ధాత్రి ఫౌండేషన్ లఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ జయేశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ పహాడే, జిల్లా సభ్యులు వై. శ్రీనివాస్, కరుటూరి సత్యనారాయణ, ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న స్వప్న

పాతంగల్, జూలై 10: మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాలులో బుధవారం జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ స్వప్న ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులకు బేటి బచావో, బేటి పడావో, గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, లైంగిక వేధింపులు, గృహహింస, మహిళ చట్టాలు, ఆపద సమయంలో ఎవరిని సంప్రదించాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎల్ పుష్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, మనీ, హెచ్‌ఈవో గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

కోటగిరి, జూలై 10: సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని యశశ్రీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం సీజనల్ వ్యాధులు, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.పాత కుండీలు, కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుషితమైన నీటిని వినియోగించవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రోజా, మంజుల, ఆశ కార్యకర్తలు అనురాధ, స్వప్న, గంగామణి పాల్గొన్నారు.

'విద్యార్థినికి విద్యుత్ షాక్'పై విచారణ

పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించిన ఎంఈవో

విచారణ చేపడుతున్న పోలీసులు

సారంగాపూర్, జూలై 10: నగర శివారులోని సారంగాపూర్ గ్రామ జడ్పీ హైస్కూల్‌లో సులోచన అనే విద్యార్థిని మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఎంఈవో రామారావు బుధవారం పాఠశాలకు ఆరోటౌన్ ఎస్సై మొగులయ్యతో కలిసి విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 'మన ఊరు – మన బడి' కింద అసంపూర్తిగా మిగిలిన విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేయకపోవడంతో విద్యుత్ షాక్ ఘటన చోటుచేసుకున్నట్లు వారు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయించాలని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోకి విన్నవించారు. అనంతరం ఎంఈవో జిల్లా ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు. విచారణ నివేదికను డీఈవోకు అందజేస్తానని తెలిపారు.

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి: పీడీఎస్‌యూ

ఖలీల్‌వాడి, జూలై 10 : విద్యుత్‌షాక్ గురైన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. బుధవారం సారంగాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి, 'విద్యార్థినికి కరెంట్ షాక్' ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ..అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థిని కరెంట్ షాక్‌కు గురైనట్లు ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభం కాక ముందే మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రతి ఏడాది అధికారులు, ప్రభుత్వానికి విన్నవించినా తీరు మారకపోవడం దారుణమన్నారు. విద్యుత్ షాక్‌కు గురైన విద్యార్థిని కుటుంబానికి 2 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో తాగునీరు, టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. కలెక్టర్, విద్యాధికారులు సారంగాపూర్ పాఠశాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

ఎడపల్లి, జూలై 10: మండల కేంద్రానికి చెందిన బాలికకు పెళ్లి జరిపించిన ఇదే గ్రామానికి చెందిన ఇస్మాయిల్ ఖాన్‌ను మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎడపల్లి పోలీసులు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో ఇస్మాయిల్ ఖాన్ దగ్గరుండి బాలిక పెండ్లి చేయించాడని పోలీసులు పేర్కొన్నారు. ఎడపల్లి పోలీసుల సహకారంతో ముషీరాబాద్ పోలీసులు ఇస్మాయిల్ ఖాన్‌ను అరెస్టు చేశారు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖలీల్‌వాడి, జూలై 10 : జిల్లా కేంద్రంలో ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా, అతడి సంబంధీకులు ఎవరూ రాలేదు. దీంతో పోలీసులు అతడిని అనాథగా గుర్తించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై మహేశ్ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా.. బుధవారం దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశానవాటికలో అనాథ శవానికి సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ పీఎస్ సిబ్బంది అర్జున్, ఇందూరు యువత సభ్యులు మద్దుకూరి సాయిబాబు, జయదేవ్, సాయితేజ ,రాజు పాల్గొన్నారు.

నాణ్యతను పరిశీలించాకే వ్యాక్సిన్లు ఇవ్వాలి

మోర్తాడ్, జూలై 10: పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇచ్చే ముందు వాటి నాణ్యత, గడువు తేదీలను తప్పకుండా చూడాలని చౌట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ సూచించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వ్యాక్సిన్లకు సంబంధించిన రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మమత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించనున్న సత్యాగ్రహదీక్ష కార్యక్రమానికి వెళ్తారనే సమాచారంతో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డితోపాటు కిసాన్ మోర్చా నాయకులను ఆర్మూర్ పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. – ఆర్మూర్‌టౌన్, జూలై10

వనమహోత్సవం పనులు ప్రారంభించాలి

ధర్మోరాలో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

మాక్లూర్/మోర్తాడ్/నవీపేట(రెంజల్), జూలై10: వనమహోత్సవానికి సంబంధించిన పనులను ప్రారంభించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్యపనులు పరిశీలించారు. మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ధర్మోరాలోని నర్సరీలో మొక్కలను పరిశీలించారు. పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, వజ్రోత్సవ పార్కులను పరిశీలించారు. కొత్తపల్లిలో అమ్మ ఆదర్శపాఠశాల పనులు పరిశీలించారు. డీకంపల్లిలో బృహత్ పల్లె ప్రకృతివనం, కల్లడి, సింగంపల్లి గ్రామాల్లో పెంచుతున్న సంపద వనాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో జైక్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, ఏవో పద్మ, హెచ్‌ఎం మధుసూదన్ రావు, సెక్రటరీ సుభాష్ ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు. ఇంటింటా మొక్కలు నాటేలా చూడాలని డీఆర్‌డీవో, కమ్మర్‌పల్లి మండల ప్రత్యేకాధికారి సాయాగౌడ్ అన్నారు. ఉప్లూర్ గ్రామ పంచాయతీలో మహిళాసంఘాల సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు. అంతకు ముందు కమ్మర్‌పల్లిలో పల్లెప్రకృతివనాన్ని, నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, కార్యదర్శి శాంతి కుమార్ పాల్గొన్నారు. పాలెం ఉన్నతపాఠశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. రెంజల్ మండలంలోని దూపల్లి జీపీ కార్యాలయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి హరితహారం మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

ఆర్మూర్‌టౌన్, జూలై10: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డీసీవో శ్రీనివాస్ రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అంకాపూర్‌లో బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్ తదిరులు ఉన్నారు.

డిచ్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం జగన్నాథుని రథయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. స్థానిక శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో బలబద్ర జగన్నాథుడు, సుభద్ర విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం సుభద్ర, జగన్నాథ, బలబద్రుడిని రథంపై ఊరేగించారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం, ఇస్కాన్ ఇందూరు కేంద్రం అధ్యక్షుడు బలరాందాస్, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు. – డిచ్‌పల్లి, జూలై 10

సంక్షిప్తంగా..

- **టీయూ విద్యార్థి పురం నవీన్‌కు డాక్టరేట్:** డిచ్‌పల్లి, జూలై 10: టీయూ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి పురం నవీన్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ బి.సాయిలు పర్యవేక్షణలో 'సిద్ధిసిస్ ఆఫ్ నావెల్ ఆమైడ్ ఫంక్షన్ లైజుడ్ ట్రైపోర్ మిథైల్ పీరిడిన్ డేరివేటివ్స్ , దీర్ ఫార్మాకోలాజికల్ యాక్టివిటీ' అనే అంశంపై పరిశోధన చేశాడు. బుధవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షలో అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో పీహెచ్‌డీ డిగ్రీకి ఆమోదం తెలిపారు.
- **కామర్స్ విభాగాధిపతిగా రాంబాబు గోపిశెట్టి:** డిచ్‌పల్లి, జూలై 10 : టీయూ కామర్స్ విభాగాధిపతిగా ఆచార్య రాంబాబు గోపిశెట్టి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి బుధవారం నియామకపత్రాని అందజేశారు. ప్రస్తుతం ఆచార్య రాంబాబు కామర్స్ విభాగానికి డీన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో వర్సిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు.
- **అభివృద్ధి పనుల పరిశీలన:** మోస్రా (చందూర్), జూలై 10 : మోస్రా మండల కేంద్రంతో పాటు గోవూర్, దుబ్బతండా గ్రామాల్లో బుధవారం ప్రత్యేక అధికారి రమేశ్ నర్సరీలు, అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రఫీ, ఏపీవో సురేశ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.
- **ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు:** వినాయక్‌నగర్, జూలై 10: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. స్థానిక చంద్రశేఖర్ కాలనీలోని ఓ ఇంటి పై దాడి చేయగా అక్కడ పేకాడుతున్న ఐదుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11,520 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
- **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి:** వినాయక్‌నగర్, జూలై 10: నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో రెండురోజులుగా చికిత్స పొందుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 8న దుబ్బలోని ఓ వైన్స్ షాపు ఎదుట ఉన్న మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికుల సమాచారంతో ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దవాఖాన సిబ్బంది తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు తెలియరాలేదని సంబంధిత మూడో టౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.
- **ఘనంగా గురుపూజోత్సవం :** సుభాష్‌నగర్, జూన్ 10: గురువులు మార్గదర్శనానికి ప్రతీకలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రతినిధి కాచం రమేశ్ అన్నారు. బుధవారం ఆర్మూర్‌రోడ్ శ్రావ్యగార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి వక్తగా హాజరైన కాచం రమేశ్ మాట్లాడుతూ.. యువత గురువుల మార్గదర్శకంలో దేశభక్తి, దైవభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్‌రావు , నగర నిర్వహణ ప్రతినిధి అర్గుల సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **రథశాల నిర్మాణ పనులకు భూమిపూజ:** ఇందల్వాయి, జూలై 10 : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో రథశాల నిర్మాణ పనులకు వీడీసీ, ఆలయ అభివృద్ధి సహాయక బృందం ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ చేశారు. నిర్మాణం కోసం పలువురు దాతలు ముందుకువచ్చారు.ఇంకా దాతలు ముందుకురావాలని వీడీసీ చైర్మన్ జితేందర్ కోరారు.కార్యక్రమంలో వడ్ల భూమేశ్వర్, ప్రధాన అర్చకులు గోపాలచారి, జక్కుల ప్రవీణ్, అవుసుల గంగాచారి , శ్రీరామసేవా సమితి సభ్యులు, లోకని గంగాధర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, రైతువేదిక ఇన్‌చార్జి గంగారాం, మాజీ ఉపసర్పంచ్ రాజేందర్ పాల్గొన్నారు.
- **రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత:** సారంగాపూర్, జూలై10: మల్కాపూర్ గ్రామానికి చెందిన బండోల్ల గంగాధర్ కుటుంబానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును అధికారులు బుధవారం అందజేశారు. గంగాధర్ ఈ ఏడాది జనవరి 14న ఖుద్వాన్ ఎల్లమ్మ దైవ దర్శనం కోసం వెళ్లి అక్కడ కోనేరులో జారిపడి మృతి చెందాడు. గంగాధర్ ప్రమాదబీమా పాలసీ తీసుకోగా.. రూ.20 లక్షల చెక్కు మంజూరుకాగా.. మృతుడి భార్యకు ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మహేశ్వర్ అందజేశారు.
- **బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం-** నవీపేట (రెంజల్), జూలై 10: రెంజల్ మండలం దూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కృష్ణ, రాములు బుధవారం పాఠశాల తరుపున సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి గణేశ్‌రావు, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమ లింగంగౌడ్, సాయన్న, రాజేశ్వర్, రాధ తదితరులు పాల్గొన్నారు.
- **డయాలసిస్ మిషన్లను వినియోగించాలి -** శక్కర్‌నగర్, జూలై 10: బోధన్‌లోని ప్రభుత్వ దవాఖానలోని రెండు నూతన డయాలసిస్ మిషన్లను వినియోగంలోకి తేవాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ అహ్మద్ ఖలీల్ దవాఖాన అధికారులకు బుధవారం వినతిపత్రం సమర్పించారు.
- **లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయల్ కార్యవర్గం -** శక్కర్‌నగర్, జూలై 10: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ కార్యవర్గాన్ని బుధవారం బోధన్ పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నార. అధ్యక్షుడిగా ఎండీ జమీలుద్దీన్, కార్యదర్శిగా దమ్మల్ల జ్యోతి రాజ్, కోశాధికారిగా గుంజి రవీందర్ ఎన్నికయ్యారు.
- **వినతిపత్రం అందజేత-** ఆర్మూర్‌టౌన్, జూలై10: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గజానన్‌కు చేపూర్ వీడీసీ సభ్యులు వినతిపత్రం బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన సారంగి విజయ్ వీడీసీకి చెందిన స్థలాన్ని ఆక్రమించాడని అన్నారు. సర్వే చేయించి గ్రామానికి చెందిన స్థలాన్ని వీడీసీకి అప్పగించాలని కోరారు.
- **విద్యార్థినులకు వైద్యపరీక్షలు** –బాల్కొండ, జూలై 10: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్రవంతి, హెల్త్ సూపర్‌వైజర్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.
- **అమ్మ ఆదర్శపాఠశాల పనుల పరిశీలన** – మోర్తాడ్, జూలై 10: పాలెం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల పనులను మోర్తాడ్ మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ బుధవారం పరిశీలించారు. అంతకు ముందు పాలెం, మోర్తాడ్ గ్రామపంచాయతీలను సందర్శించారు. పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.
- **నేడు చలో హైదరాబాద్-** నందిపేట్/సిరికొండ/ రుద్రూర్, జూలై 10 : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలంటూ గురువారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం సభ్యులు బుధవారం కోరారు. నందిపేట్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేశ్ పిలుపునిచ్చారు. సిరికొండలో కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రుద్రూర్‌లో జీపీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడారు.
- **గ్రామాల్లో ప్రత్యేకాధికారి పర్యటన-** ధర్పల్లి/ఏర్గట్ల, జూలై 10: ధర్పల్లి మండలం దుబ్బాక, కేశారంతో పాటు నడిమి తండా, కార్పూర్ తండా, హొన్నాజీపేట్, వాడీ తదితర గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో బాలకృష్ణతో కలిసి బుధవారం పర్యటించారు. ఆయన వెంట టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.ఏర్గట్ల, బట్టాపూర్, తడ్‌పాకల్ గ్రామాలను మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో శివ కృష్ణ సందర్శించారు. శానిటేషన్, వనమహోత్సవం, అమ్మఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, DYAVARSHETTI KALPANA (Old Name) W/o DYAVARASHETTY SRINIVAS , R/O ,H.No : 3-35,Vill:Thorthi, Mdl: Yergatla ,Dist :Nizamabad. TG. Now Changed My Surname / Name as **DYAVARASHETTY LAVANYA (NEW NAME) W/O DYAVARASHETTY SRINIVAS.**

NTZ-340165

CHANGE OF NAME

★I, SUDDAPALLY RAJANI (Old Name) R/O H.NO: 1-10,DHARPALLY ,Dist :NZB. Hence Changed My Name As **SUDDAPALLY LAVANYA W/O: SUDDAPALLY RAJENDHAR GOUD**(NEW NAME)

NTZ-340167

పాస్‌పోర్ట్ పోయినది

నేను నిచ్చెం మహేష్ తండ్రి పేరు రాజేశ్వర్ నిచ్చెం, వయస్సు: 30,ఇ.నెం.4-73, వడ్లగల్లీ గ్రా||&మం||భీమ్‌గల్,జి||నిజామాబాద్ తెలంగాణ రాష్ట్రం .తేది:16-6-2024 తేది నాడు నాయొక్క బైక్ మీద భీమ్‌గల్ గ్రామంలోని వడ్లగల్లీ నుండి భీమ్‌గల్ బస్టాండ్‌కి వెళ్తున్న సమయంలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్‌నెం. **K4791449** గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరని మనవి. సంప్ర|| సెల్: **93983 21072**

WANTED

స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న HIV ఎయిడ్స్ నివారణ కార్యక్రమము (టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్) నిజామాబాద్ సైట్‌లో పనిచేయడానికి Out Reach Staff నిజామాబాద్‌లో పనిచేయడానికి ఇద్దరు మహిళలు + బోధన్‌లో పనిచేయడానికి ఇద్దరు మహిళలు + ఆర్మూర్ లో పనిచేయడానికి మహిళ ఒకరు కావలెను. (అర్హత: ఇంటర్ పాస్) (గౌరవ వేతనం 10500+TA 1500), మరియు మహిళ పీర్ ఎడ్యుకేటర్లు (10th P/F) నిజామాబాద్ నందు -6, బోధన్-4, ఆర్మూర్-2 కావలెను, గౌరవ వేతనం 4000/-+ 600/- Note : HIV నివారణలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.అప్లికేషన్ సమర్పించడానికి చివరి తేది: 15-07-2024 సాయంత్రం 5-00 గం||ల వరకు. **సెల్:9885715897,8639422001.**

పాస్‌పోర్ట్ పోయినది

★Kushanpally Sai Kumar S/o. Kushanpally Ramulu R/o. H.No. 3-55, Vill: Mailaram, Mdl: Sirikonda Dist: Nizamabad. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. S5048780 గలది మైలారం నుండి సిరికొండకు బైక్ పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది ఎవరికైన దొరికినచో సంప్ర|| సెల్: 8106578784

NTZ-340170

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే